అలరి
ALLARI

తెలుసుకుందాం

1. విద్యుదయస్కాంతం తయారీకి దేన్ని వాడతారు? • మెత్తని ఇనుము
2. 'మౌదుగుపూలు' నవలను ఎవరు రచించారు? • దాశరథి రంగాచార్య
3. ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం ఏది? • గ్రీన్ ల్యాండ్

పెద్దల మాట

నూనె వేస్తూ ఉంటేనే దీపం వెలుగుతుంది. మనం ప్రేమ చూపిస్తుంటేనే.. మనపైన ప్రేమ అనే ప్రకాశం పడుతుంది.

• మదర్ థెరిస్సా

గుర్తుపట్టు

కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Nothing

Ex : Thin

సమయం విలువ

పూర్వం హరి – గిరి అనే ఇద్దరు దోస్తులు ఉండేవాళ్లు. హరి రాజభవనంలో ఖజానాను చూసుకొనే ఉద్యోగం చేస్తుండేవాడు. గిరి మాత్రం ఏ పనీ చేయకుండా, సోమరిగా తిరిగేవాడు. ఒకరోజు గిరితో.. ''ఏదైనా పని చేసుకోవచ్చు కదా! ఖాళీగే ఇలా ఉంటే ఎలా?'' అని సలహా ఇచ్చాడు హరి. దానికి గిరి.. ''నాకు ఎవరూ పని ఇవ్వడం లేదు. ఎందుకంటే నేనంటే పడనివాళ్లు.. నేను చాలా బద్ధకస్తుణ్ని నాపై తప్పుడు ప్రచారం చేశారు!'' అని బదులిచ్చాడు. అప్పుడు హరి.. ''నేను ఎలాగూ ఖజానా చూసుకునే ఉద్యోగమే చేస్తున్నాను కదా! అక్కడి ధనాగారంలోని డబ్బును లెక్క పెట్టడానికి నీతిమంతులైన ఉద్యోగులు కావాలి. నువ్వు రేపు ఉదయాన్నే రాజ భవనానికి రా! పనికి తగ్గ ఫలితం ఉంటుంది!'' అని చెప్పాడు. గిరి ఇంటికి వెళ్లి తన భార్యతో విషయం చెప్పాడు. వెంటనే ఆమె కూడా.. ''ధనాగారంలో పని అంటే.. ఎంతో గౌరవం! నువ్వు రేపు ఉదయాన్నే వెళ్లి పనిలో చేరు!'' అని చెప్పింది.

తెల్లవారి ఆలస్యంగా నిద్రలేచాడు హరి. ఉద్యోగానికి వెళ్లాలని భార్య తొందరపెట్టినా.. హరి ఏమాత్రం పట్టించుకోలేదు. ''ఇప్పుడే ఎందుకు తొందర? ధనాగారం తెరవడానికి చాలా సమయం పడుతుంది. నేను భోజనం చేసి వెళ్తా! ముందైతే నాకు అన్నం పెట్టు!'' అన్నాడు. కడుపునిండా తిని, ఇంట్లోనే ఓ గంటసేపు విశ్రాంతి తీసుకున్నాడు. తర్వాత నెమ్మదిగా లేచేసరికి మధ్యాహ్నం అయింది. ఆదరాబాదరాగా రాజ భవనానికి బయల్దేరాడు. అది ఎండకాలం. దాంతో నడక వల్ల తీవ్రంగా అలసిపోయాడు. మార్గమధ్యలో చెట్టు కింద ఆగి విశ్రాంతి తీసుకున్నాడు. అలసిపోయి ఉండటంతో.. వెంటనే కన్ను అంటుకుంది. నిద్ర లేచేసరికి పొద్దు వాలుతున్నట్లు గుర్తించాడు. హడావుడిగా లేచి.. మళ్లీ నడక మొదలుపెట్టాడు. తాను రాజభవనానికి చేరుకునే సరికే.. చీకటి పడే వేళయ్యింది. అప్పటికే ధనాగారంలో పనిచేసేవాళ్లంతా వెళ్లిపోయారు. హరి కూడా గిరి కోసం ఎదురు చూసీచూసీ, ధనాగారానికి తాళం వేసి వెళ్లిపోయాడు. గిరి వచ్చేసరికి మూసి ఉన్న ధనాగారం తలుపుల దగ్గర భటులు కాపలా కాస్తూ కనిపించారు. దాంతో చేసేది లేక చింతిస్తూ.. ఇంటి దారిపట్టాడు. తన సోమరితనం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని బాధపడ్డాడు. సమయం విలువైందని గ్రహించకుండా దోస్తు ఇచ్చిన అవకాశాన్ని కోల్పోయాడు.

• కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

కథ

జనాబులు

పూరించండి : BICYCLE, BAG

టంగ్ ట్విస్టర్స్

Green glass globes glow greenly.

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com

పిటర్ స్క్వాండ్స్

ఎ. వల్లభ్, సిద్దిపేట

పూరించండి

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి

తేజా @ 76 వేల ఎకరాలు

- జిల్లాలో రికార్డు స్థాయిలో సాగవుతున్న మిర్చి పంట
- రైతుబంధు, రాయితీలతో పంట సాగుపై మక్కువ
- సాగునీటి వనరుల్లో పుష్కలంగా ఉన్న జలాలు
- పత్తి కంటే మిరప పంటే మేలని భావించిన రైతులు
- కోల్డ్ స్టోరేజీలలో తగ్గిన మిర్చి నిల్వలు
- వచ్చే పంటను మళ్లీ నిల్వ చేసుకునే అవకాశం
- చీడపీడల నివారణకు వైరా కేవీకే శాస్త్రవేత్తల కృషి

తీర్థాల గ్రామంలో సాగు చేసిన మిర్చి తోట

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 2 : జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు.. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లోకి సమృద్ధిగా చేరిన నీటితో రైతులు వరి, పత్తి, మిర్చి సాగ పనుల్లో నిమగ్నమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు కల్పించిన రైతుబంధు, రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ సంబురంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. సాధారణంగా మిర్చి సాగు అనగానే మొదటగా గుర్తుకొచ్చేది ఖమ్మం జిల్లానే. ప్రధాన పంటల సాగుతో మిర్చి పంటను రైతులు పోటీపడి పండిస్తున్నారు. రైతులు ఇక్కడ పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేసిన వ్యాపారులు పొరుగు రాష్ట్రాలతోపాటు చైనా, బంగ్లాదేశ్, బ్యాంకాక్, వియత్నాం తదితర దేశాలకు ఏటా ఎగుమతి చేస్తూ లాభాలు గడిస్తున్నారు. యావత్ తెలంగాణ రాష్ట్రంలోనే తేజా రకం మిర్చి పంట ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో మాత్రమే సాగవుతుందంటే ఆ పంటకు అంత డిమాండ్ ఉందన్నమాట. పంట సాగుకు ఇక్కడి భూములు అనుకూలంగా ఉండడంతో రైతులు పూర్వం నుంచి ఎక్కువ మొత్తంలో పండిస్తున్నారు. సహజంగా జిల్లాలో మిర్చి పంట సాధారణ సాగు విస్తీర్ణం 50 వేల ఎకరాలు కాగా.. గడిచిన రెండేళ్ల నుంచి అంచెలంచెలుగా సాగు పెరుగుతున్నది. రెండేళ్లుగా మార్కెట్‌లో మిర్చి ధర గతంలో ఎన్నడూ లేని విధంగా నిలకడగా ఉండడంతో మిర్చి సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. గత ఏడాది మార్కెట్‌లో ఏసీ రకం మిర్చికి రికార్డు స్థాయిలో క్వింటా ధర రూ.22 వేలు పలికింది. దీంతో అప్పటి నుంచి రైతులు ఎక్కువగా మిర్చి సాగు చేయడానికి మక్కువ చూపుతున్నారు. ఈ ఏడాది వానకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు మిర్చి సాగు 76 వేల ఎకరాలకు చేరింది. రానున్న రోజుల్లో సాగు విస్తీర్ణం మరికొంత పెరిగే అవకాశం ఉన్నది.

జిల్లాలో మిర్చి సాధారణ సాగు విస్తీర్ణం	50,500 ఎకరాలు
గత ఏడాది సాగు విస్తీర్ణం	61,350 ఎకరాలు
ఈ ఏడాది సాగు విస్తీర్ణం	76,017 ఎకరాలు (ఇప్పటి వరకు)
పంట దిగుబడి అంచనా	1,25 375 మెట్రిక్ టన్నులు
ఎకరానికి సరాసరి దిగుబడి	1.50 మెట్రిక్ టన్నులు

కేవీకే, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సలహాలు సూచనలు

ఒకవైపు జిల్లాలో అధిక మొత్తంలో మిర్చి పంట సాగు కావడంతో వైరా కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట క్షేత్రాలను సందర్శిస్తున్నారు. పంట సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, జాగ్రత్తలపై సలహాలు సూచనలు ఇస్తున్నారు. జిల్లా రైతులుతోపాటు పొరుగు జిల్లాల్లో సైతం మిర్చి సాగు పెరగడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టే పనిలో ఉన్నారు. అంతేకాక జిల్లాస్థాయంగా ఉన్న కోల్డ్ స్టోరేజీలలో మిర్చి నిల్వలు తగ్గడం.. ఈ ఏడాది పంట కూడా ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుండడంతో అధిక ధర పలికే అవకాశం ఉన్నట్లు రైతులతో పాటు వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి.

మండలాలవారీగా సాగు ఇలా...

ఈ ఏడాది వానకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 76,017ఎకరాల్లో రైతులు మిర్చి పంట సాగు చేశారు. మండలాలవారీగా పరిశీలిస్తే.. కామేపల్లి మండలంలో 8,389 ఎకరాలు, ఖమ్మం అర్బన్ 89, రఘునాథపాలెం 4,600, ఖమ్మం రూరల్ 3,536, కూసుమంచి 4,143, నేలకొండపల్లి 650, తిరుమలాయపాలెం 9,325, బోనకల్ 3,047, చింతకాని 1,295, మధిర 6,140 , ముదిగొండ మండలంలో 2,761 ఎకరాల్లో పంట సాగవుతున్నది. అలాగే ఎర్రుపాలెం మండలంలో 5,512 ఎకరాలు, సత్తుపల్లి 7, తల్లాడ 6,451, వేంసూరు 145, ఏన్కూరు 7,549, కొణిజర్ల 1,455, సింగరేణి 6,894, కల్లూరు 1,974, పెనుబల్లి 1,295, వైరా మండలంలో 760 ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. అత్యధికంగా తిరుమలాయపాలెం మండలంలో, అత్యల్పంగా సత్తుపల్లి మండలంలో ఎర్రబంగారం సాగు చేశారు.

చీడపీడల నివారణపై ప్రత్యేక దృష్టి

గతంతో పోల్చితే ఈ ఏడాది జిల్లాలో మిర్చి తోటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. పంటలను చీడపీడలు ఆశించకుండా వైరా కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పంట నీజన్‌కు ముందే మిర్చి నారు విక్రయించే నర్సరీలను పలుమార్లు సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశాం. కొద్ది రోజులుగా కొన్ని ప్రాంతాల్లో పంటకు బొబ్బ రోగం సోకుతున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో తోటలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్నారు.

–జీ.అనసూయ, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి

నాడు బీళ్లు.. నేడు పైర్లు..

టేకులపల్లి మండల ముఖచిత్రాన్ని మార్చిన 'మిషన్ కాకతీయ'

తెల్లవాగు చెరువు, రెడ్డి వీరయ్య కుంట చెరువులకు మహర్దశ

వీటి ఆయకట్టు కింద పూర్తిగా సాగులోకి 650 ఎకరాలు

కోనసీమను తలపించేలా పచ్చందాలు, పంట పొలాలు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 2 : ((నమస్తే తెలంగాణ) : నిండా తూటికాడతో, లోపలంతా పూడిక మట్టితో ఆనవాళ్లు కోల్పోయిన తహరాలకు తెలంగాణ సిద్ధించాక మహర్దశ పట్టింది. రాష్ట్రం ఆవిర్భవించిన తొలినాళ్లలోనే చెరువుల పునరుద్ధరణకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. దీంతో చెరువుల ఫలితంగా రైతుల బతుకులు బాగుపడ్డాయి. టేకులపల్లి మండలంలోని ఓ రెండు చెరువులను పరిశీలించినా ఇదే తీరు ప్రస్ఫుటిస్తోంది.

ఎటు చూసినా పచ్చని పంటలే..

మిషన్ కాకతీయ కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి మండలంలోని తెల్లవాగు చెరువు, రెడ్డి వీరయ్య కుంట చెరువులకు మరమ్మతులు చేసింది టీఆర్ఎస్ ప్రభుత్వం. దీంతో అప్పటి నుంచి అవి నిండుకుండలను తలపిస్తున్నాయి. భూగర్భజలాలూ పెరిగాయి. ఫలితంగా ఆ చెరువుల ఆయకట్టు కింద రెండు పంటలూ సమృద్ధిగా సాగవుతున్నాయి. వీటి కింద సుమారు 650 ఎకరాల మేర ఎటు చూసినా పచ్చని పంటలే కన్పిస్తున్నాయి. కోనసీమను తలపించేలా కనుచూపు మేరలో పచ్చందాలే దర్శనమిస్తున్నాయి.

జిల్లాలోనూ పెరిగిన విస్తీర్ణం..

మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా చెరువుల పునరుద్ధరణ జరగడంతో జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం అమాంతం పెరిగింది. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,354 చెరువులకు మిషన్ కాకతీయ కార్యక్రమం కింద మరమ్మతులు చేశారు. దీంతో ఆయకట్టు చివరి భూములకు పుష్కలంగా నీరందుతోంది. ఫలితంగా రైతులు కూడా ఏటేటాదాది సాగు విస్తీర్ణాన్ని పెంచుతూ వచ్చారు. 2014లో జిల్లాలో కేవలం 2.50 లక్షల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం.. 2023 నాటికి అమాంతం పెరిగి 4.90 లక్షల ఎకరాలకు చేరుకుంది. ఈ క్రమంలో రైతులు వరి పంటనేగా పత్తి, మిర్చి, ఆయిల్‌పాం పంటలనూ అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

పంటలకు ఇక ధోకా లేదు..

చెరువు బాగుంటే రైతుకు అన్నీ ఉన్నట్టే. చెరువుకు అంతటి ప్రాధాన్యముందని సీఎం కేసీఆర్ గుర్తించారు కాబట్టే మిషన్ కాకతీయ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చెరువులను బాగు చేయించారు. ఇప్పుడు చెరువులన్నీ తొణికిసలాడుకుండడంతో మాలాంటి రైతులకు రుంది లేకుండా, పంటలకు ధోకా లేకుండా పోయింది. ఇప్పుడా చెరువుల్లో ప్రభుత్వమే చేపలు పెంచుతుండడంతో అటు మత్స్యకారులూ చల్లగా బతుకుతున్నారు.

–తాళ్లూరి నాగేశ్వరరావు, రైతు, కోయగూడెం, టేకులపల్లి మండలం

ప్రజలు గ్యారెంటీలు.. వారంటీలు నమ్మొద్దు

వైరా వైరాలో బీఆర్ఎస్ నాయకులతో సమావేశం

ఎమ్మెల్యే టికెట్ కాగితంతో సమానం: వైరా ఎమ్మెల్యే రాములునాయక్

వైరా టౌన్, అక్టోబర్ 2: ప్రజలు గ్యారంటీలు, వారంటీలు అంటున్న పార్టీలను నమ్మొద్దని, సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని ఎంపీ నామా నాగేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా వైరా పట్టణంలో తొలుత ఎమ్మెల్యే రాములునాయక్, బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్‌తో కలిసి రోడ్ షో నిర్వహించి అనంతరం పట్టణంలోని కమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యారంటీలు గురించి మాట్లాడే పార్టీని గెలిపిస్తే రాష్ట్రం భిరోగమనంలోకి వెళ్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు సామర్థ్యం పని చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. చిన్న చిన్న భేషజాలను పక్కన పెట్టి వైరా నియోజకవర్గం నుంచి మదన్‌లాల్‌ను గెలిపించి పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. వైరా ఎమ్మెల్యే రాములునాయక్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే టికెట్ తనకు కాగితంతో సమానమని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో తాను గెలుపు గుర్రం కాదని, అయినప్పటికీ బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్ గెలుపుకోసం పని చేస్తానన్నారు. తనకు కష్ట సాధింపులకు పాల్పడే ఆలోచనే లేదన్నారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని శిరసావహిస్తానన్నారు. బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాములునాయక్ నాలుగున్నర ఏళ్ల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడారని, ఆయన సపోర్ట్‌తో వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. 'ఎమ్మెల్యే బావ రాములునాయక్ కృష్ణుడు అయితే నేను అర్జునుడి లాంటి వాడిని..' అని సభాముఖంగా ప్రకటించారు.

సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముచ్చటగా ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, వైరా అభ్యర్థిని గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వాలన్నారు. వైరా నియోజకవర్గ ప్రజల కోసం ఇద్దరం పాటుబడతామని అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి మోహన్‌రావు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, జడ్పీటీసీలు నంబూరి కనకదుర్గ, పోట్ల కవిత, ఎంపీపీ వేల్పుల పావని, డిశ్క కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జున్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, కౌన్సిలర్లు వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ కోటయ్య, లాల్‌మహ్మద్, దారెల్లి పవిత్రకుమారి, ఏడునూరి పద్మజ, మాదినేని సునీత, వనమా దిన్ని, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, ఏడునూరి శ్రీను, మరికంటి శివ, కొత్తా వెంకటేశ్వరరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, దొంతెబోయిన గోపి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా, పక్కన ఎమ్మెల్యే రాములునాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్జి ఎన్ అమరావతి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 2 : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని దానవాయిగూడెం పరిధిలో గల జిల్లా జైలులో సోమవారం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. జైలు పర్యవేక్షణాధికారి ఏ.శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కుమారి ఎన్.అమరావతి, గౌరవ అతిథిగా జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావిద్ పాషా, ఆత్మీయ అతిథిగా ఖమ్మం నగర అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ హరికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ సూచించిన విధంగా అహింస, శాంతి మార్గంలో నడవాలన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు సహజమన్నారు. క్షణికావేశంలో జైలుకు వచ్చిన ఖైదీలు ఇక్కడ శిక్ష అనుభవించి బయటకు వెళ్లేటప్పుడు మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో జైలర్లు సక్రునాయక్, జీ లక్ష్మీనారాయణ, జైలు వైద్యుడు సిద్ధార్థ్‌తోపాటు జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నామా సమక్షంలో బిఆర్ఎస్‌లో పలువురి చేరిక

వైరాటౌన్, అక్టోబర్ 2: వైరా మండలంలోని గొల్లెనపాడు గ్రామానికి చెందిన 12 కుటుంబాలు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ ఆధ్వర్యంలో ఎంపీ నామా నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాయి. సోమవారం స్థానిక కమ్మవారి కళ్యాణ మండపంలో వారికి ఎంపీ నామా పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

అభినయం.. నృత్యం కలబోసిన చైతన్యం

బ్యూటీషియన్‌గా కొనసాగుతూనే నటిగా ప్రయాణం

టీవీ, సినీ రంగాల్లో రాణిస్తున్న మన్యం బిడ్డ

పలు చిత్రాలు, ధారావాహికల్లో మెరిసి భేష్ అనిపించుకున్న యువతి

చర్లవాసి, నటి చైతూరావుపై ప్రత్యేక కథనం

చర్ల, అక్టోబర్ 2: మన్యం బిడ్డ, చర్లవాసి గాదె చైతూరావు (చైతన్య) తాత రంగస్థల నటుడు మార్కండేయులు వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని బుల్లితెరతోపాటు సినీరంగంలోనూ రాణిస్తున్నది. ఒకవైపు చర్లలో బ్యూటీపార్లర్ నడుపుతూ స్వయం ఉపాధి పొందుతూనే టీవీ, సినీ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. నటనలో తనదైన శైలిని ప్రదర్శిస్తూ మన్నులు పొందుతున్నది. కళలపై మక్కువ ఉన్న చైతన్య చిన్నప్పటి నుంచే నృత్యం, అభినయంలో మెళకువలు నేర్చుకున్నది. అయినవాళ్ల అవహేళనలు తట్టుకున్నది.. సన్నిహితులు నుంచి అమమానాలను ఎదుర్కొన్నది.. 'ఆడపిల్లలు రంగస్థలంలో రాణించగలరా..? సినీ రంగంలో నిలదొక్కుకోగలరా..?' అన్న ప్రశ్నలకు తన బుల్లితెరపై నాటికలతో.. సెల్యూలాయిడ్‌పై సినిమాలతో సమాధానిస్తున్నది.. ఇప్పటివరకు తాను మహాలింగాపురం, కృష్ణపుట్టం, రుద్రంకోటతోపాటు మరికొన్ని చిత్రాల్లో నటించింది. నట దిగ్గజమైన తణికెళ్ల భరణి, సినీనటి జయలలిత వంటి వారితో స్క్రీన్ షేర్ చేసుకున్నది. పలు టీవీల్లో ప్రసారమవుతున్న బంగారు పంజరం, సంకల్పం, కల్పన ధారావాహికల్లో నటించి వీక్షకులను ఆకట్టుకుంటున్నది.

రుద్రంకోట సినిమాలో

సొంతంగా యూట్యూబ్ చానల్ నడుపుతూ.

బ్యూటీషియన్‌గా, నృత్యకారిణిగా, నటిగా గుర్తింపు తెచ్చుకున్న చైతన్య తాజాగా యూట్యూబర్‌గా మారింది. భద్రాద్రి జిల్లాలో మరుగున పడిన చరిత్రను వెలికితీస్తున్నది. ప్రసిద్ధ ఆలయ పురాణాలపై రీసెర్చ్ చేస్తున్నది. ఇప్పటికే ఎన్నో వీడియోలు చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నది. 'మనం ప్రయత్నించనిది ఏదీ దరికి రాదు..' అనే పెద్దల మాటను స్ఫూర్తిగా తీసుకుని చైతన్య తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నది. పుట్టిన గడ్డ పేరు నిలబెట్టాలని, కుటుంబానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలనే తపనతో ముందుకు సాగుతున్నది. సినీ రంగంలో స్థిరపడి గుర్తింపు తెచ్చుకునే వరకు వివాహం చేసుకోనని, తల్లిదండ్రులను బాగా చూసుకుంటూ ముందుకెళ్లడమే ప్రస్తుత తనముందున్న కర్తవ్యమని చైతన్య తేల్చి చెప్తున్నది. ఆల్ ది బెస్ట్ టు చైతన్య..!